సాక్షి చిత్తూరు

మంగళవారం । 28 । నవంబర్ । 2023



నూతన ఒర'బడి'

నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 8లో



సేంద్రియ పంటల సందర్శన

బంగారుపాళెం మండలంలో సేంద్రియ పంటల సాగును సీజీఐఏఆర్ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది.

- 8లో



శివయ్య క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి కార్తీక సోమవారం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- 8లో

పరీక్ష సమయం!

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు వేయాలి.. ఉత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దాలి.. పిల్లల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేయాలి.. ఇదే లక్ష్యంతో రాష్ట్ర విద్యా పరిశోధన మండలి పకడ్బందీ ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా ఒకటి నుంచి పదోతరగతి వరకు సమ్మేటివ్–1 పరీక్షలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మంగళవారం నుంచి షెడ్యూల్ ప్రకారం అసెస్‌మెంట్ టెస్టులను ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసింది. ఈ క్రమంలోనే తొలిసారిగా టోఫెల్ ప్రింటెడ్ పేపర్లను వినియోగించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది.



- నేటి నుంచి సమ్మేటివ్–1 ప్రారంభం
- హాజరుకానున్న 2,06,651 మంది విద్యార్థులు
- తొలిసారి టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఎస్‌ఏ– 1 పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ టెస్ట్‌ల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) విడుదల చేసింది. ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ క్రమంలో జిల్లాకు వచ్చిన ప్రశ్నపత్రాలను జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం వారు 31 మండలాల ఎంఈఓలకు సరఫరా చేశారు. పరీక్ష ప్రారంభమయ్యే ముందు ప్రశ్నపత్రాలను ఏ రోజుకు ఆరోజు ఆయా పాఠశాలలకు అందజేయనున్నారు.

తొలిసారి టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు

ఈ పర్యాయం తొలిసారిగా టోఫెల్ పరీక్షలకు సైతం ప్రింటెడ్ ప్రశ్నపత్రాలను వినియోగించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 161 పాఠశాలల్లో టోఫెల్ పరీక్ష నిర్వహించనున్నారు. 3 నుంచి 5వ తరగతి వరకు ఒక ప్రశ్నపత్రం, 6 నుంచి 9 వ తరగతి వరకు ఒక ప్రశ్నపత్రంతో పరీక్ష నిర్వహించనున్నారు. ఇంగ్లిష్‌లో విద్యార్థులు ప్రావీణ్యం పెంపొందించుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం టోఫెల్ విద్య ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు ఉన్న ప్రభుత్వం పాఠశాలల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించేవారు. ఈ దఫా ప్రింటెడ్ పేపర్లను ఎస్‌సీఈఆర్‌టీ సరఫరా చేసింది. సాధారణ పరీక్షల మాదిరిగానే ఇకపై టోఫెల్ పరీక్షను ప్రింటెడ్ పేపర్లలో విద్యార్థులు రాయనున్నారు. ఎస్‌ఏ–1 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 2,06,651 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రభుత్వం పాఠశాలల్లోని 46,775 మంది పిల్లలు టోఫెల్ ప్రింటెడ్ ప్రశ్నపత్రాలతో పరీక్షలు రాయనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

విభిన్న విధానంలో..

ఒకటి నుంచి తొమ్మిదో తరగతుల విద్యార్థులకు బైలింగ్విష్ విధానంలో, పదో తరగతి వారికి మీడియం వారీగా ప్రశ్నపత్రాలు అందజేయనున్నారు. పరీక్షల నిర్వహణకు విద్యా శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రశ్నపత్రాలపై సీక్రెట్ క్యూఆర్ కోడ్ కేటాయించింది. పేపర్లను ఎవరైనా లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం క్షణాల్లో బయట పడే అవకాశం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తోంది.



తవణంపల్లె ఎంఈఓ కార్యాలయంలో ప్రశ్న పత్రాలను పరిశీలిస్తున్న డీఈఓ

జిల్లా సమాచారం

1 నుంచి 5వ తరగతి విద్యార్థులు :	94,901
పరీక్ష నిర్వహించే పాఠశాలలు :	2,366
6 నుంచి 10వ తరగతి చదివేవారు :	1,11,750
పరీక్షలు నిర్వహించే బడులు :	707
ఇందులో టోఫెల్ పరీక్ష రాసేవారు :	46,775

అలసత్వం వహిస్తే చర్యలు



సమ్మేటివ్–1 పరీక్షలను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి. ఎలాంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవు. పరీక్షల నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తాం. నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ఈ సారి టోఫెల్ పరీక్షలు ప్రింటెడ్ ప్రశ్నపత్రాలతో నిర్వహిస్తున్నాం.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లా వ్యాప్తంగా సమ్మేటివ్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. అన్ని మండలాలకు ప్రశ్నపత్రాలను చేరవేశాం. ఏ రోజుకు ఆరోజు ప్రశ్నపత్రాలను సంబంధిత పాఠశాలలకు అందజేస్తాం. పరీక్షలకు సంబంధిత ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు.

– హేమారెడ్డి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ, చిత్తూరు.

వరసిద్ధుని సేవలో సాయిధరమ్‌తేజ్



సాయిధరమ్‌తేజ్‌తో ఆలయ అధికారులు, అర్చకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని సినీ నటుడు సాయిధరమ్ తేజ్ సోమవారం రాత్రి సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయాధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

'ఆపస్' రాష్ట్ర అధ్యక్షుడిగా బాలాజీ



చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడిగా కార్వేటినగరం డైట్ కళాశాల అధ్యాపకుడు శవన్నగారి బాలాజీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీకి సంఘం తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, సాంబిరెడ్డి, మంజునాథగుప్తా, విజయ్ అభినందనలు తెలిపారు.

న్యూస్‌రీల్

తల్లీబిడ్డ, 104 డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, 104 వాహనాల్లో డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104, 108 జిల్లా మేనేజర్ ప్రతాప్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి, కార్వేటినగరం, పుంగనూరులో ఖాళీ పోస్టులు ఉన్నట్లు వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణులై, డ్రైవింగ్ లైసెన్సు గల అభ్యర్థులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని 104, 108 కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

రెండోదశ నాడు-నేడుపై అవగాహన

బంగారుపాళెం: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో నాడు–నేడు రెండో దశపై అంగన్‌వాడీలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సోమవారం అవగాహన కల్పించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి నాగశైలజ మాట్లాడుతూ ఐరాల, బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండో విడత నాడు–నేడు కింద 146 అంగన్‌వాడీ భవనాలను ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఆయా భవనాలను పరిశీలించి అవసరమైన నిధులను అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల భవనాలను ఆధునికీకరించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ వాణిశ్రీదేవి, ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్ బాబు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' లోగో ఆవిష్కరణ

- పోటీలకు రిజిస్ట్రేషన్ ప్రారంభం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల లోగో (మస్కట్)ను కలెక్టర్ షణ్మోహన్ సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 27వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. డిసెంబర్ 15 నుంచి పోటీలు మొదలవుతాయని వెల్లడించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. 2024 ఫిబ్రవరి 3వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు డిసెంబర్ 13వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. 15 ఏళ్ల నిండిన వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. టోల్ ఫ్రీ నెంబర్ 1902తోపాటు www. aadudamandhra. ap.gov.in వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బాలాజీ పాల్గొన్నారు.

శాస్త్రోక్తం.. సత్యనారాయణ వ్రతం



ఊరేగుతున్న శివపార్వతులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ అనుబంధమైన వరదరాజుల స్వామిగుడిలో సోమవారం శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామివారు గరుడవాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు.

ఆదిదంపతుల విహారం

వరసిద్ధుని అనుబంధ ఆలయం మణికంఠేశ్వరస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతులను విశేషంగా అలంకరించి శేషవాహనంపై ఊరేగించారు. ఆలయంలో నిర్వహించిన కార్తీక దీపోత్సవలో చైర్మన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

10వేల మొక్కల పెంపకం

చిత్తూరు కార్పొరేషన్: పశ్చిమ అటవీశాఖ పరిధిలో పలు మొక్కలు పెంచుతున్నట్లు ఎఫ్ఆర్‌ఓ బాలకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అటవీ పరిధిలో పదివేల జామ, నేరేడు, నారేపి, మద్ది, మొక్కలు నాటినట్లు వెల్లడించారు.

ఆదర్శవంతంగా ఆలయాభివృద్ధి



పాలకమండలి సమావేశంలో చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయాంలో ఆదర్శవంతంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ పాలక మండలి సమావేశం నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గత రెండేళ్లలో అందరి సహకారంతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. దేవుడి ఆశీస్సులతో మరో రెండేళ్లు స్వామివారికి, భక్తులకు సేవచేసే భాగ్యం దక్కిందని చెప్పారు. ఈ పర్యాయం కూడా మరింతగా ఆలయాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. భక్తులకు సులభతరంగా స్వామివారి దర్శనభాగ్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. డిసెంబర్‌లో పలు ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. సమావేశంలో ఆలయ ఈఓ వెంకటేశు, ట్రస్ట్ బోర్డు సభ్యులు నరసింహులుశెట్టి, గోవర్ధన్, గోపి, రవీంద్రుడు, కొండయ్య, కాంతమ్మ, సుబ్బలక్ష్మమ్మ, ఎక్స్‌అఫిషియో సభ్యుడు సోమశేఖర్ గురుకుల్, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఓర్వలేకే ఫ్రస్టేషన్

- ప్రజలను ఏమార్చేందుకే మాయమాటలు
- మాజీ మంత్రి అమర్‌పై ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆగ్రహం



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, చిత్రంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు

పలమనేరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను ఓర్వలేకే మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ విమర్శించారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రోడ్ల విషయంలో ప్రజలను ఏమార్చేందుకే అమరనాథరెడ్డి మాయమాటలు వల్లిస్తున్నారని మండిపడ్డారు. గత టీడీపీ హయాంలో మంజూరు చేసిన రోడ్డు పనులను అమరనాథరెడ్డి తన తమ్ముడు శ్రీనాథరెడ్డికి కట్టబెట్టారని, వాటికి సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నగదు చెల్లించారని వెల్లడించారు. పుంగనూరు ఇండియన్ బ్యాంకులో మాజీ మంత్రి అమర్ సోదరుడు శ్రీనాథరెడ్డి ఖాతాలో నగదు పడలేదని నిరూపిస్తే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. 2018లో మంత్రిగా ఉన్న ప్పుడు అమరనాథరెడ్డి బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్– రామసముద్రం రోడ్డు పనులు మంజూరు చేశారన్నారు. ఈ పనులను స్వయానా ఆయనకు తమ్ముడైన శ్రీనాథరెడ్డి చేపట్టారని తెలిపారు. ఇందుకు సంబంధించిన రూ.79.71లక్షలు శ్రీనాథరెడ్డి ఇండియన్ బ్యాంకు ఖాతా నంబర్ 84073662కు ఈ ఏడాది జూలై 25వ తేదీన జమైనట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ రోడ్ల నిర్మాణ పనులను మాజీ మంత్రి తన బినామీ కాంట్రాక్టరైన శ్రీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రై లిమిటెడ్, బళ్లారికి కట్టబెట్టి, ఎన్నికల్లో టీడీపీ ఓటమిపాలు కాగానే పనులు ఆపేశారని ఆరోపించారు. ఈ పనులు చేస్తే వైఎస్సార్‌సీపీకి మంచి పేరొస్తుందని అమరనాథరెడ్డి కుట్రపన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. దీనిపై తాము కాణిపాకంలో ప్రమాణానికి పిలిస్తే మాజీ మంత్రి నోరు మెదపలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఆ పనులను వైఎస్సార్‌సీపీ పనులు పూర్తి చేసిందని వెల్లడించారు. అమరనాథరెడ్డికి దమ్ముంటే గ్రామాల్లోకి వెళ్లి నాటి టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న తేడాను గమనించాలని కోరారు. టీడీపీ ఎప్పుడో ఎక్స్‌పైర్ అయిన పార్టీ అని స్పష్టం చేశారు. మాజీ మంత్రి సొంత మండలమైన పెద్దపంజాణిలో చిన్నేపల్లెకు రూ.40 లక్షలతో రోడ్డు వేయించామని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని 50 గ్రామాల్లో రోడ్డు పనులు సాగుతున్నాయని వివరించారు. అభివృద్ధి పనులపై ఎక్కడైనా ప్రమాణం చేసేందుకు తాము సిద్ధమని, అమరనాథరెడ్డి వచ్చి ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పార్టీ గంగవరం మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు మండీసుధా, ప్రహ్లాద, చంద్రప్ప, చలపతిరెడ్డి, గిరిరాజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రవి, కౌన్సిలర్లు రహీంఖాన్, షబీర్, రమేష్‌రెడ్డి, హైదర్, సల్మాశ్యామ్, శ్యామ్‌సుందర్, కుమార్, మున్నా, నరేష్ పాల్గొన్నారు.

కౌండిన్యలో చిరుతలు!

కౌండిన్య అభయారణ్యంలో చిరుతల సంచారంపై సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పెద్దసంఖ్యలో ఆవులు.. దూడలు.. మేకలు క్రూరమృగాల బారిన పడి మృతి చెందడంతో దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇన్నాళ్లు హైనాలే జీవాలపై దాడి చేస్తున్నట్లు ప్రకటించిన అటవీశాఖ అధికారులు సైతం తాజా ఘటనలతో పునరాలోచనలో పడ్డారు. ఇటీవలే గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృత్యువాత పడడంతో తమ లెక్క తప్పిందని వెల్లడిస్తున్నారు.



వి.నాయకనేరి వద్ద వాహనం ఢీకొని మృతి చెందిన చిరుత (ఫైల్)



గంకొండలో చిరుత కళేబరం (ఫైల్)



క్రూర మృగాల దాడిలో మరణించిన మేక (ఫైల్)

- అటవీప్రాంతంలో మృత్యువాత పడుతున్న ఆవులు, దూడలు, జీవాలు
- చీటాలు, లెపార్డ్స్, హైనాలు సంచరిస్తున్నట్లు సమాచారం
- ఆందోళనలో ఫారెస్ట్ సమీప గ్రామాల్లోని ప్రజలు

పలమనేరు : ఏనుగులకు నిలయమైన కౌండిన్య అభయారణ్యంలో ఇప్పుడు చిరుతలు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. పలమనేరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో పలు దూడలు, మేకలు మృతిచెందడంతో వాటిని చంపింది చిరుతలు కాదని, హైనాలని స్థానిక అటవీశాఖ అధికారులు గతంలో చెప్పేవారు. కానీ మూడేళ్ల క్రితం బంగారుపాళెం మండలంలో వేటగాళ్ల ఉచ్చులో పడి ఓ చిరుత మరణించింది. రెండేళ్ల క్రితం పెద్దపంజాణి మండలంలో మరో చిరుత కళేబరం కనిపించింది. ఏడాది క్రితం కౌండిన్య అభయారణ్యానికి పదికిలోమీటర్ల దూరంలోని తమిళనాడు ఎర్తాంగళ్‌లోని ఓ ఇంట్లోకి చిరుత చొరబడి పలువురిని గాయపరిచింది. తాజాగా నాలుగు రోజుల క్రితం వి.కోట మండలంలోని నాయకనేరి రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుతపులి మృత్యువాత పడింది. గతంలో కడతట్లపల్లె వద్ద ఓ పశువును చిరుత చంపేసిందని పశువుల కాపరి తెలిపాడు. అదే విధంగా గాంధీనగర్ వద్ద అడవిలోనూ మేతకెళ్లిన ఓ పాడిఆవు బలైంది. పలమనేరు–గుడియాత్తం అటవీమార్గంలో సైనిగుంట వద్ద చిరుతను చూశామని పలువురు వాహనచోదకులు వెల్లడించారు. ఈ ఘటనలను పరిగణనలోకి తీసుకుంటే కౌండిన్య అభయారణ్యంలో చిరుతపులులున్నట్టు తేటతెల్లమవుతోంది. ఇప్పటికే మూడు చిరుతలు మరణించగా, మరో నాలుగు వరకు ఈ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం. ఇవే కాకుండా మరో పది హైనాలు తిరుగుతున్నట్లు తెలుస్తోంది.

అటవీ గ్రామాలకు తప్పని టెన్షన్

కౌండిన్య పరిధిలో చిరుతలు, హైనాలు సంచరిస్తుండడంతో అటవీ సమీపంలోని గ్రామాలకు టెన్షన్ తప్పడం లేదు. ముఖ్యంగా పొలాలవద్ద ఇళ్లలో కాపురం ఉండేవారు, అడవిలోకి పశువులు, మేకలను తోలుకెళ్లవారు భయపడుతున్నారు. గత మూడేళ్లుగా కౌండిన్యలో మేత కెళ్లిన మందల్లోని మేకలు మాయమవుతున్నట్లు కాపరులు చెబుతుండేవారు. కానీ, కౌండిన్యలో ఉన్నవి చిరుతలు కాదని హైనాలని ఇన్నాళ్లు చెప్పుకుంటూ వచ్చిన స్థానిక అటవీశాఖ అధికారుల మాటలు తప్పని స్పష్టంగా తేలిపోయింది. కౌండిన్య అడవిలో ఏనుగులు తప్ప పులులు, చీటాలు లేవని, ఆ విషయం తమ జంతుగణనలో తేలిందని తేల్చి చెప్పిన ఫారెస్ట్ సిబ్బంది ఇప్పుడు డైలామాలో పడ్డారు. బలిజపల్లి వద్ద, గంకొండ, వి.కోట వద్ద మృతిచెందిన చిరుతలు ఎక్కడి నుంచి వచ్చాయనేది అటవీశాఖ అధికారులే ఇప్పుడు క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది.

ఇప్పటివరకు హైనాలే అనుకున్నాం



గత కొన్నేళ్లుగా పలమనేరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో మృతి చెందిన ఆవులు, దూడలను చంపింది చిరుతలు కాదు హైనాలే అని ఇప్పటి వరకు అనుకున్నాం. ఏనుగులున్న చోట చిరుతలుండవని భావించాం. కానీ ఇటీవల ఇదే అడవిలో చిరుతలు మృతి చెందడం చూస్తుంటే ఇప్పుడిప్పుడే నిర్ధారణకు వస్తున్నాం. ఇటీవల కౌండిన్యలో చేపట్టిన వన్యప్రాణులు, మృగాల గణనలోనూ చిరుతలు ఉన్నట్లు సమాచారం లభించలేదు. కానీ, చిరుతల మృతితో దీనిపై మళ్లీ సమీక్షిస్తాం.

– శివన్న, ఎఫ్ఆర్‌ఓ, పలమనేరు రేంజ్

తాడేపల్లెగూడెంలో 'ధర్మ ప్రచార రథం'



తాడేపల్లె గూడెంలో ప్రచార రథానికి స్వాగతం పలుకుతూ కళాప్రదర్శన

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ప్రచార రథం సోమవారం తాడేపల్లెగూడెం చేరుకుంది. స్థానిక గోపీనాథ్‌పట్నంలో పర్యటించింది. ఈ మేరకు రథానికి భక్తులు అపూర్వ స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రమేష్ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ శ్రీను ఇక లేరు


శ్రీనివాసులు(ఫైల్)

పుంగనూరు: రాష్ట్రస్థాయి క్రీడాకారుడు, సీనియర్ జర్నలిస్ట్, స్పోర్ట్స్ శ్రీనుగా పేరొందిన శ్రీనివాసులు(62) సోమవారం హఠాన్మరణం చెందారు. జర్నలిస్ట్‌గా తిరుపతి జిల్లా కేంద్రంలో ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం తిరుపతిలో ఒక సమావేశంలో సైతం ఆయన పాల్గొన్నారు. సోమవారం ఉదయం పలు పర్యాయాలు ఫోన్ చేసినా ఆయన లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానించిన మిత్రులు ఆయన రూమ్‌కు వెళ్లి చూడగా బెడ్‌పై విగతజీవిగా ఉండటం చూశారు. గుండెపోటుకు గురై నిద్రలోనే మరణించినట్టు గ్రహించారు. సమాచారం తెలుసుకున్న శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్(తిరుపతి) ఏఓ సయ్యద్, పలువురు పాత్రికేయులు ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. పుంగనూరు ప్రెస్‌క్లబ్, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో పలువురు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల వార్తలను రాయడంలో ఆయన సిద్ధహస్తుడు. అలాగే వివిధ క్రీడాపోటీలకు అంపైర్‌గా కూడా ఆయన సేవలు వినియోగించుకున్న సందర్భాలు అనేకం. ఆయన స్వగ్రామమైన పెద్దపంజాణి మండలం చలమంగళంలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు ఇద్దరు సోదరులు ఉన్నారు.

శివయ్య క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శివయ్యను దర్శించుకున్నారు. అనంతరం కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. సోమవరం పున్నమి ఘడియలు ఉండడంతో కొండచుట్టు ఉత్సవంలో అధిక సంఖ్యంలో భక్తులు పాల్గొన్నారు. సోమవరం ఒక్క రోజే సుమారు రూ.50 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లుగా అధికారులు ప్రకటించారు.

నూతన ఒరవడి

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. అందులో భాగంగా నాడు–నేడు పథకంతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతోంది. రూ.వేలాది కోట్లు వెచ్చించి అత్యున్నత మౌలిక వసతులు కల్పిస్తోంది. ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు చక్కగా చదువుకునేలా సర్వం సమకూరుస్తోంది. ఇప్పటికే వందలాది స్కూళ్లు అద్భుతంగా సిద్ధం చేసింది. ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు–నేడు పథకంపై తల్లిదండ్రులు..ఉపాధ్యాయుల హర్షాతిరేకాలు వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్

జనవాక్కు


నాడు–నేడు పథకంలో అద్భుతంగా తీర్చిదిద్దిన పాఠశాల

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



నాడు–నేడు పథకంలో సర్కారు బడులకు మహర్దశ వచ్చింది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడంతోనే మార్పు సాధ్యపడింది. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. అధునాతన వసతులతో ఉన్నతంగా తయారు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ఈ స్థాయిలో సిద్ధమవుతాయని కలలో కూడా ఊహించలేదు. పిల్లలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను చిన్నపాటి లోపం కూడా లేకుండా కల్పించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునే వెసులుబాటు అందించారు. ఇంత చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– మెరీనా, టీచర్, కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల, కార్వేటినగరం

రూపురేఖలు మారాయి



మా కుమారుడు పి.అవినాష్ రెడ్డి బుగ్గ అగ్రహారం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. మా గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల గతంలో అధ్వాన్నంగా ఉండేది. ఒకసారి విద్యార్థులు ప్రార్థనకు వచ్చిన సమయంలో తరగతి గది శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడిన ఘటన కూడా జరిగింది. మా పిల్లలకు ఏమైనా జరుగుతుందేమో అని బిక్కు బిక్కుమని ఉండాల్సిన దుస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పాఠశాలను నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేశారు. ఇప్పుడు బడి రూపురేఖలే మారిపోయాయి. కార్పొరేట్ స్థాయిలో ఉంది. నిశ్చింతగా మా బిడ్డను పాఠశాలకు పంపుతున్నా.

– సత్యారెడ్డి, విద్యార్థి తండ్రి, నగరి మండలం

కార్పొరేట్‌కు దీటుగా..



మేము విధులు నిర్వర్తిస్తున్న గొల్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకప్పుడు సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఇప్పుడు నాడు–నేడు పథకంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు కల్పించారు. మొదటి దశలో రూ.37 లక్షలు, రెండో దశలో రూ.42 లక్షలను వెచ్చించారు. ఆ నిధులతో పాఠశాలలో అవసరమైన మరుగుదొడ్లు, అదనపు తరగతుగదులు, విద్యుత్, ఆర్‌ఓ సిస్టమ్, శ్లాబులకు మరమ్మతులు చేయించారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఆదర్శనీయం.

– భారతి, టీచర్, గొల్లపల్లె, పుత్తూరు మండలం

పేద విద్యార్థులకు మేలు



సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు జగనన్న ఎనలేని మేలు చేశారు. వారి ఉన్నత భవిష్యత్‌కు మార్గం వేశారు. పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపలేని ఆర్థిక పరిస్థితి మాది. సర్కారు బడుల్లో నేనెప్పుడూ ఇలాంటి సౌకర్యాలను చూడనేలేదు. చిన్నప్పటి నుంచి మా బడిని చూస్తున్నాను. ఎంతో మంది ముఖ్యమంత్రులు పాలించారు కానీ, ఈ స్థాయిలో పేదలకు అండగా నిలిచింది జగనన్న మాత్రమే. ఇప్పుడు మా ఊరి బడి ఎంతో బావుంది. ప్రైవేట్ పాఠశాలలో కూడా ఇన్ని సౌకర్యాలు లేవు. ముఖ్యమంత్రి రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

– ఆదెమ్మ, విద్యార్థి తల్లి, కృష్ణాపురం, కార్వేటినగరం మండలం

చికిత్సపొందుతూ యువకుడి మృతి


ఆస్పత్రిలో మృతదేహం

యాదమరి: రోడ్డుప్రమాదంలో గాయపడి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్న గుర్తుతెలియని యువకుడు సోమవారం మృతి చెందాడు. పదిరోజుల క్రితం మండలంలోని మోర్ధానపల్లె వద్ద బెంగళూరు–చెన్నై జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 30 ఏళ్ల వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు ఆస్పత్రికి తరలించగా చివరకు మరణించాడు.

రోడ్డుప్రమాదంలో ఒకరు..


మృతి చెందిన బాలాజీ


బాలాజీ (ఫైల్)

వి.కోట: మండలంలోని దొడ్డిపల్లె క్రాస్ వద్ద వి.కోట–పలమనేరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు చెందిన బాలాజీ(30) తన ద్విచక్రవాహనంలో వి.కోట నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ఎదురుగా కారు, లగేజీ ఆటో వస్తున్నాయి. ఈ క్రమంలో కారు ప్రమాదవశాత్తు ఆటోను ఢీకొంది. అదుపుతప్పిన ఆటో బాలాజీ వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బాలాజీ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కారు, ఆటోను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలాజీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సేంద్రియ పంటల సందర్శన

బంగారుపాళెం: మండలంలోని కల్లూరుపల్లెలో సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న పంటలను సోమవారం అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంప్రదింపుల (సీజీఐఏఆర్) బృందం సందర్శించింది. 9 దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు గ్రామానికి చెందిన రైతులు ఉమ, జ్ఞానసేఖర్ సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల మేరకు ఎలా సాగు చేస్తున్నారో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ వివరించారు. ఆరోగ్య కరమైన పంట ఉత్పత్తులను అందించేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం రైతులతో సమావేశమై వారికి అందుతున్న ఆర్థిక ప్రయోజనాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, ఎంపీటీసీ సభ్యులు స్వాతి, సీతారామారావు, టీమ్ లీడర్ జాకేల్, ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, డీపీఎం వాసు, ఏఓ చిట్టిబాబు, సీఆర్పీ అభికా గాంధీ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగి సస్పెన్షన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.ప్రకాష్‌ను సస్పెండ్ చేస్తూ కమిషనర్ అరుణ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న ఎం.వసంత అనే కార్మికురాలు గత ఏడాది అక్టోబర్‌లో చనిపోతే, ఆమె కుటుంబీకులకు పెన్షన్ ఇవ్వడానికి ప్రతిపాదనలు పంపడంలో ఆయన నిర్లక్ష్యం వహించడంతో వేటు వేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న సురేష్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. అలాగే ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వడంలో సైతం కార్యాలయ అధికారి ఒకరు జాప్యం చేస్తున్నట్లు సమాచారం.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని మృతదేహం

కుప్పంరూరల్ : పట్టణంలోని పెద్ద పల్లి గంగమ్మ గుడి వద్ద బెంగళూరు–చెన్నై మార్గంలో సోమవారం రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ నాగరాజు మా ట్లాడుతూ మృతుడికి సుమారు 45 ఏళుఉంటాయని, కుడిచేతిపై చిరంజీవి అని పచ్చబొట్టు ఉందని వెల్లడించారు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పలమనేరు : మండలంలోని నక్కపల్లి వద్ద పలమనేరు–కుప్పం రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. నక్కపల్లికి చెందిన రెడ్డెప్ప కుమారుడు ఆంజనేయులు(28) బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. క్షతగాత్రుడిని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మరణించాడు.

కారు బోల్తా

పలమనేరు బైపాస్‌రోడ్డులో నెల్లూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న కారు సోమవారం ఉదయం కుక్కను తప్పించబోయి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో నెల్లూరుకు చెందిన బాలాజీ(55) దంపతులు గాయపడ్డారు.